# ఆఖరి దశ

కాశీనగరంలో గంగానదీ తీరాన, తెల్లవారుజామున వెన్నెలలోని స్వచ్ఛమైన సాయంకాలపు సూర్యకిరణాల్లో అతి తళతళలాడే అలలను చూస్తూ గద దస్తుకొని, దానికి నుంచి వచ్చే ఘుమఘుమలను గట్టిగా గట్టి పద్దతులను చూస్తున్నారు.

ఇద్దరూ సమవయస్కులు. వయస్సు అరవై దాటి చాలా కాలమైంది. ముఖవర్చస్సు, ముసలి వయస్సు గౌరవ సూచకంగా చెందిన వాళ్ళలా కనిపిస్తున్నారు.

"ఏం రామస్వామీ! ఇంత ఆలస్యంగా వచ్చావేం? ఆందోళనగా కూడా ఉన్నట్టున్నావు?"

"ఇంకా వార్త వినలేదా ఏమిటి నువ్వు?" అని ఆశ్చర్యపడుతూ అడిగాడు రామస్వామి.

"ఏ వార్త? నేనేం వినలేదు. ఏమిటో చెప్పు త్వరగా."

"కురుక్షేత్ర సంగ్రామం ముగిసిందట!"

"నిజమా! ఎప్పుడు?"

"నిన్న సాయంత్రం అయింది. వార్త ఇప్పుడే తెలిసింది."

"అంతా ఎలా జరిగింది? వివరాలేమిటి? ఏమిటి కథ?"

"వివరాలు ఆ ధీమంతుడే ప్రత్యక్షంగా చెప్పుకున్నాట్ట."

"అయితే యుద్ధం ముగిసినట్టేనా?"

"ఆ! అనర్థంతో యుద్ధం ముగిసింది."

"అధర్మ యుద్ధం అంటున్నావేమిటి?"

"గదా యుద్ధంలో రారాజుని జయించలేక చివరికి తొడలమీద కొట్టి చంపేశాడు భీమసేనుడు. అలా కొట్టమని పక్కనుంచి ప్రోత్సహించాడు కృష్ణుడు."

"హరహరా! ఈ కృష్ణుడు చేయించే పాపాలకి హద్దుపద్దూ లేదు."

"ఆతగాడు సాక్షాత్తూ శ్రీ మహా విష్ణువు అవతారం, అతనేం చేసినా తప్పులేదని పాండవుల ప్రచారం."

"శ్రీ మహా విష్ణువు, ఏమైనా అనుకోవచ్చుగాని కొంపలు ముట్టించే కొరివి మాత్రం కాదు."

"కొంపలు ముట్టించే రాజకీయం నేర్చుకుండటంవల్లే తన ఇంటిచుట్టు కొచ్చింది. ఈ కృష్ణుడు రాజకీయవేత్తే కాదట. గొప్ప వేదాంతి కూడానట."

"అదొకటా!"

"కాక! "పాపం ఆ అర్జునుడు తొలిదినం "నా కీ రాజ్యం వద్దు, గీజ్యం వద్దు. నాస్వా చేతులారా వీళ్ళ నెవ్వర్నీ నేను చంపలేను" అని అస్త్ర సన్యాసం చేసి కూర్చుంటే, ఈ నల్లవాడు పెట్టి వేదాంతం అంతా బోధపర్చి పురెక్కించి రెచ్చగొట్టేట్ట."

"అహా! నాకీ విషయం ఇంతవరకూ తెలియలేదు స్మా. అయినా ఆ కిరీటికి విరక్తి పుట్టి ఉండొచ్చు. కాని, ఆ పెద్దవాడి రాజ్య కాంక్ష ఎక్కడికి పోతుంది చెప్పూ."

"ఆ కాంక్షే ఇంతా తెచ్చి పెట్టింది."

"మాశావా! ప్రాపంచిక సౌఖ్యాల కోసం తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు—సాధారణులు కూడా కారు. గొప్పవారు, పండితులు, జ్ఞానులు—అంతా ఒకర్నొకరలా పొడుచుకు చంపుకున్నారో, వీరితోపాటు అమాయక ప్రజానీకం ఎంత హతమయిందో!"

"దేవదత్తా! ఎటు చూసినా అధర్మం ప్రబలిపోతోంది. ఆర్యుల్లోనే ఈ అధర్మం పొడసూపినప్పుడు ఇంక అనార్యుల సంగతి చెప్పవలసిందేముంది?" అన్నాడు చారుదత్తుడు విచారంతో.

"ధర్మ పద్ధతికి చరమ కాలం వచ్చింది" అన్నాడు దేవదత్తుడు.

"ధర్మాధర్మాల మాటేమిటి? నీకూ, నాకూ, అందరికీ, అన్నిటికీ ఆర్యావర్తానికే కాదు, మహా ప్రపంచానికే అంత్య కాలం ఆసన్నమయి నట్టుంది."

అంతవరకూ సూర్య కిరణాలు పడి మిల మిల మెరసిన గంగాజలం కొన్నిచోట్ల ఎర్రబడింది; కొన్నిచోట్ల నల్లబడింది.

"హరహర మహాదేవ శంభో" అన్నరవం ప్రతిదిక్కునుండీ వినవస్తోంది. నాయకత్వ దేవపుత్రులు లేచి విశ్వేశ్వరాలయం వైపు నడిచారు.

*　　　*　　　*

సాయం సమయం. సంఘారామంలో తటాకానికి దిగే చలువరాతి మెట్లమీద నిల్చున్నారిద్దరు బౌద్ధ సన్యాసులు. ఇద్దరూ వృద్ధులు. స్నానం చేసి తుడుచుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

"అంతే కాదా నందా! ఈ శంకరాచార్యుడు శివుడి అవతారమట. అందరూ చెప్పుకుంటున్నారు" అన్నాడు ఉపాలి.

"ఈ బ్రాహ్మణులు మన తథాగతుడికే విష్ణ్వంశ సంభూతుడన్నారు. ఆశ్చర్యం ఏముంది?" అన్నాడు ఆనందుడు.

"కాని, ఎవడీ శంకరుడు? ఎక్కడ్నించి ఊడిపడ్డాడు?"

"మంటు పుట్టడం మళయాళ దేశంలో పుట్టింది కాని తాత ముత్తాతలెవరో ఇక్కడ్నించే తర్లి వెళ్ళారట అటువైపుకి. పూర్వాశ్రమంలో బ్రాహ్మణాధముడు."

"అలా చెప్పు. అయితే ఇంత కాలం తథాగతుడికి తల లొగ్గిన బ్రాహ్మణాధములు మంత్ర తంత్రాలతో తిరిగి తల లెత్తుతున్నారన్నమాట."

"ఎత్తుతున్నారని మెల్లిగా అంటున్నావా? ఎత్తి పడగ విప్పి ఆడుతున్నారు. వాళ్ళ నాయకుడే ఈ శంకరాచారి."

ఉపాలి కొంతసేపు మౌనంగా నిల్చొని, "వాదం విపరీతంగా వ్యాపిస్తోందటకదా?" అని అడిగాడు.

"మనలో దోషాలు పెచ్చు పెరగడం చేతనే దానికి విరుగుడుగా ఇటువంటి వాదం పుట్టుకొచ్చింది."

"మనలో దోషాలు ఉంటే ఉండవచ్చు. కాని ఈ శంకరాచార్యకాని విజయుడయినట్లయితే ప్రజలు పూర్వంలాగే మాడి మసయి పోతారన్న మాటే."

"నిజమే..."

"మన యొక్క ఈ సంఘాలు, మతం, మన ధర్మపద్ధతి, మన భిక్షువులు లేనినాడు ప్రపంచం అంతా చివరి దశకి వచ్చినట్టే" అని నిట్టూర్చాడు ఉపాలి.

* * *

తాజ్ మహల్ సమీపాన్న సుందరోద్యానంలో పూల మొక్కల మధ్య పచ్చగడ్డిమీద కూర్చున్నారు ఇద్దరు మహమ్మదీయులు. విలువైన వస్త్రాలు ధరించారు. వారి టోపీలూ, చేతి కర్రలూ పక్కనపడి ఉన్నాయి. సాయంకాలపు నీరెండ తాజ్ మహల్ అంచులకొక వింత శోభ తెచ్చి పెట్టింది. చల్లని గాలి వీస్తోంది.

"భాయీ, ఔరంగజేబ్ పాదుషా చనిపోయారని పుకార్ పుట్టింది విన్నావా?" అని అడిగాడు హుసేన్‌ఖాన్.

"పుకారు మాత్రం కాదు. నిజమే" అన్నాడు రహిమాన్.

"అరె! నిజమేనంటావా?"

"అవో! నిజమే."

"ఎవరు చెప్పారు నీకు?"

చెవిలో ఏదో మెల్లిగా ఊదాడు రహిమాన్.

"అల్లా, అల్లా! అయితే కబురు నిజమే అయుండాలి" అని వేదనలో అరిచాడు హుసేన్‌ఖాన్.

"మనం అల్లాని ప్రార్థించడం తప్ప మరింక చేసేదేం లేదు" అన్నాడు రహిమాన్.

"ఇహ రాజ్యానికి షాజాదాలంతా కొట్టుకు చస్తారు."

"ఆదెలాగా తప్పదు. అందులో ఎవరు నెగ్గినా ఒక్కటే. ధాటీగా పరిపాలించే శక్తి ఎవడికీ లేదు."

హుసేన్‌ఖాన్ నిస్పృహతో అన్నాడు.

"అయితే కాఫర్లింక మనల్ని బతకనివ్వరు. డెక్కన్లో మరాఠీ దొంగలు ఇదివరకే చెలరేగేరు. ఇటు సిక్కులు కత్తులు నూరుతున్నారు. అంతవరకూ ఎందుకు ? ఢిల్లీలోనే ద్రోహం చెయ్యడానికి కాఫర్లు సాహసిస్తున్నారట విన్నావా ?"

"మన నీరసం చూసి ఏమైనా చేస్తారు. వేటగాడు లోకువైతే లేడి మూడుకాళ్లమీద నడుస్తుందిట !"

"ప్చ్ ! ఖరాబ్ రోజులొచ్చేయి భాయీ."

"మొగల్ సామ్రాజ్యానికే చెడ్డరోజు లొచ్చాయంటే ప్రపంచశాంతికే భంగం కలిగిందనుకో."

"కాదా మరి !!"

"ఒక్క కాఫర్లే కాదు. పైనుండి ఇరానీలు, మంగోలీలు, ఇటు కాఫర్లు, మధ్య మనం. అంతా కలిసి తగవులాడి కొట్టుకొని నానా గోల్ మాలూ జరుగుతుంది."

"మరొకటి. ఈ మధ్య ఓడలమీద దిగుతున్నారు చూసేవా, తెల్ల వాళ్లు ! వాళ్ల వైపెవరూ చూడ్డంలేదు. వాళ్లీ మధ్య కొత్త కొత్త ఆయుధాలు తీసుకొచ్చి జాగ్రత్త చేస్తున్నారట."

"భాయీ ! వీళ్లూ వాళ్లూ అనకు. నానా భీభత్సం జరుగుతుంది. ప్రపంచంలో ఇంక శాంతి అనేది ఉండదు. 'మొగల్ సామ్రాజ్యానికి ఆఖర్రోజు లొచ్చాయి."

"మొగల్ సామ్రాజ్యానికే ఆఖర్రోజులొస్తే మహాప్రపంచానికే ఆఖర్రోజు లొచ్చాయని లెక్కవేసుకో" అన్నాడు హుసేన్ఖాన్.

* * *

క్రీస్తుశకం, పంథొమ్మిదివందల నలభయ్యేడవ సంవత్సరం ఆగస్టునెల పదిహేడవ తారీఖు.

ఆంగ్లేయు లిద్దరు క్లబ్బువరండాలో వాలుకుర్చీల్లో కూర్చొని చుట్టలు కాలుస్తూ మాట్లాడుకొంటున్నారు. బాగా చీకటిపడింది. చుట్టూ కలకత్తా నగరం కన్నులపండువుగా స్వాతంత్ర్యోత్సవాన్ని జరుపుతోంది. దీపాల తోరణాలు ఎటుచూచినా కనిపిస్తున్నాయి. తారాజువ్వలు ఆకాశాన్నందుకొంటున్నాయి. ప్రతివైపునుంచీ జయజయధ్వనులు వినిపిస్తున్నాయి.

"ఛార్లెస్! ఈ నాడింత కోలాహలం చేస్తూన్న జనమంతా కొద్ది కాలంలో గోరీల్లోనూ, శ్మశానాల్లోనూ ఉంటారు, చూసుకో!" అన్నాడు రిఛర్డ్.

"బాగా చెప్పేవు" అన్నాడు ఛార్లెస్.

"పంజాబ్‌లో అప్పుడే అల్లర్లు బయల్దేరేయి, తెలుసా?"

"పంజాబ్ అన్నమాటేమిటి? దేశమంతటా బయల్దేరేయి."

"వీళ్లంట, పరిపాలన సాగించేవాళ్లు!"

"ఇదంతా వినాశానికే వచ్చింది."

"అంతటికీ కారణం, మన దేశంలో చేతకాని గవర్న్మెంటు రావడం."

"అదీ ఓ కారణం అయినా దీన్లో Fate పనిచేస్తూందనుకో. ప్రపంచమంతా ముక్కలుముక్కల పాలవుతోంది. మన సామ్రాజ్యం ఇలా నీళ్ళ కలిసిపోతోందా? అటు రష్యన్ భల్లూకం దొరికినవాళ్ళనందర్నీ భక్షించేస్తోంది. దొరకనివాళ్ళకోసం చేతులు జాస్తోంది."

"ఇటు ఏటమ్ రహస్యం మనకైనా చెప్పకుండా అమెరికన్లు పట్టుకూర్చున్నారు."

"వాళ్లెందుకు చెప్తారు? మనమీద మెరిగేద్దామని వాళ్లు చూస్తున్నారు కదా!"

"వాళ్ళూ వీళ్ళూ మనంకూడా జర్మనీలో బైఠాయించి రాళ్లు రువ్వుకొంటున్నాం.?"

"మనమధ్య జర్మనీయేకాక యూరప్ అంతా నలిగిపోయింది."

"ఇటు ఆసియాలో ఇండియన్లతోసహా అంతా కొట్టుకుచస్తున్నారు."

"అంతా ఘోరంగా ఉంది."

"చూస్తూవుంటే ప్రపంచానికి ఆఖరిదశ సమీపించినట్టుంది."

"బాగా చెప్పావు"

* * *

ప్రపంచం సాగుతూనే ఉంది ఇన్నివేల సంవత్సరాలనుంచీ, ఇన్ని యుగాలనుంచీ.

—"భారతి" ఆగస్టు 1950.